ముదిపింఛన్!

- సామాజిక భద్రతకు ప్రభుత్వ ప్రాధాన్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న అభాగ్యులు

సీటీఆర్ఐ: ఆపన్నులు, అభాగ్యులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వృద్ధాప్యం ఆనందమయం చేసేందుకు ఆర్థిక భరోసా కల్పిస్తోంది. కుటుంబ పెద్దను కోల్పోయినా, ఏతోడూ లేని వారికి ఆపన్నహస్తం అందజేస్తోంది. చేతి వృత్తులు, కల్లు గీత కార్మికులను సైతం అక్కున చేర్చుకుంటోంది. ఇందుకు వైఎస్సార్ పింఛన్ కానుక పథకం పేరుతో అందజేస్తున్న సామాజిక భద్రత పింఛన్ల కార్యక్రమం మరింత విస్తృతం చేస్తోంది. అర్హతే ప్రమాణికంగా ప్రతి ఆరు నెలలకోసారి కొత్త పింఛన్లు మంజూరు చేస్తోంది.

పారదర్శకంగా..

అర్హత ఉన్న ఏ ఒక్కరూ పింఛను దూరం కాకూడదన్న తలంపుతో ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా లబ్ధి చేకూరుస్తోంది. కులం, మతం, ప్రాంతం అనే బేధాలు లేకుండా, లంచాలు, వివక్షకు తావులకుండా అర్హులకు సంక్షేమ ఫలాలు అందిస్తోంది.

టీడీపీ హయాంలో అధ్వానం

టీడీపీ ప్రభుత్వ హయాంలో అర్హులు పింఛను పొందాలంటే నరకం చూడాల్సి వచ్చేది. లేదంటే ఎవరు చనిపోతారా? అని ఎదురుచూసే పరిస్థితి తలెత్తేది. అన్ని అర్హతలు ఉన్నా టీడీపీ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పని జరిగేది కాదు. పైగా జన్మభూమి కమిటీ సభ్యుల సిఫారసులు తప్పనిసరి. టీడీపీ హయాంలో పింఛను రూ.1000 మాత్రమే ఇచ్చేవారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయ లబ్ధి పొందేందుకు ఈ మొత్తాన్ని రూ.2 వేలకు పెంచారు.

నూతన పింఛన్ల మంజూరు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అర్హతే ప్రామాణికంగా పింఛన్లు అందజేస్తోంది. వివక్షకు తావులేకుండా అన్ని అర్హతలు ఉన్న వారికి ఆర్థికంగా అండగా నిలుస్తోంది. ఏటా రెండుసార్లు (జనవరి, ఆగస్టు) కొత్త పింఛన్లు మంజూరు చేస్తోంది. రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో 28,620 మందికి పింఛన్లు అందజేస్తున్నారు. ఇప్పుడు అదనంగా మరో 714 మంది అర్హులకు నూతనంగా అందిస్తున్నారు. మొత్తం 29,334 మందికి సుమారు రూ.9 కోట్లు వరకూ పింఛన్ల రూపంలో పంపిణీ చేస్తున్నారు. ఈనెల ఒకటిన మొదలుపెట్టిన పింఛన్ పంపిణీ రెండోరోజు శనివారం 96 శాతం వరకూ పూర్తయ్యింది. రాజమహేంద్రవరం రూరల్‌లో ఇది వరకు 31,380 మందికి పింఛన్ అందించేవారు. ఇప్పుడు నూతనంగా మరో 704 మందికి మంజూరు చేశారు.



నూతన పింఛన్ నమోదు చేస్తున్న వార్డు సంక్షేమ కార్యదర్శి ఎం.పాపారావు

ఒకటో తేదీన పంపిణీ

టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ సొమ్ము పొందాలంటే నానాయాతన పడేవారు. ప్రస్తుతం అలాంటి దుస్థితికి చెక్ పెడుతూ ఒకటో తేదీనే పింఛన్లు అందజేస్తున్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే ఉదయాన్నే పలకరించి మరీ నగదు అందజేస్తుండటంతో వృద్ధులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నా, లేక వేరే చోట ఉన్న సరే వలంటీర్లు వారి వద్దకు వెళ్లి మరి పింఛన్ అందిస్తున్నారు.

వృద్ధాప్య పింఛన్ మంజూరు

స్థానిక 48వ డివిజన్‌లో నివాసముంటున్న ద్వారా చిట్టిరత్నానికి వృద్ధాప్య పింఛన్ మంజూరైంది. గతంలో దరఖాస్తు చేసుకున్నప్పుడు ఆమె రేషన్ కార్డులో ఆమె కొడుకు జత అయ్యి ఉండటం జరిగింది. అతను ప్రభుత్వ ఉద్యోగి కావడంతో ఆమెకు పింఛన్ మంజూరు కాలేదు. కానీ ఆమె కొడుకు ఉద్యోగ రీత్యా వేరేచోట ఉంటున్నాడు. ఈమె ఒక్కరే ఇంటి వద్ద ఉంటోంది. చిట్టిరత్నం సమస్య తెలుసుకున్న సచివాలయ కార్యదర్శులు ఆమె రేషన్‌కార్డుని స్ప్లిట్ చేయించి ఆమెకు పింఛన్ వచ్చేలా చేశారు. దీనితో ఆమెకు ఈ నెల నుంచి నూతన పింఛన్ మంజూరు అవుతుంది.

పింఛన్ మంజూరైంది



సదరన్ సర్టిఫికెట్ లేకపోవడంతో వికలాంగ పింఛన్ మంజూరు కాలేదు. 90 సచివాలయం వార్డు పరిపాలన కార్యదర్శి వై.వెంకటేష్ చొరవ తీసుకుని దగ్గర ఉండి సదరన్ సర్టిఫికెట్‌లో నా పేరు నమోదు చేయించారు. సర్టిఫికెట్ రావడంతో నాకు నూతనంగా పింఛన్ మంజూరు అయ్యింది.

– ఆళ్ల సురేష్, దివ్యాంగుడు

క్లుప్తంగా

వైభవంగా సామూహిక వివాహాలు



ఆలయ ఆవరణలో నూతన జంటలు

సీటీఆర్ఐ: స్థానిక కోరుకొండ రోడ్డులోని సింహాచల నగర్ వరాహ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో వరాహలక్ష్మీ నృసింహస్వామి ట్రస్ట్ (శ్రీ మధుభయ వేదాన్తాచార్య పీఠం ట్రస్ట్, శ్రీరంగం) ఆధ్వర్యాన ఆదివారం కల్యాణమస్తు పేరిట సామూహిక ఉచిత వివాహాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్యసింహాచలం, నాగేశ్వరరావు సారథ్యంలో ఆరు జంటలకు ప్రధానార్చకుడు అవసరాల శ్రీకిరణాచార్యులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఉదయం 10.39 గంటల సుముహూర్త సమయాన వధూవరులతో జీలకర్ర, బెల్లం పెట్టించారు. సూత్రధారణ, తలంబ్రాలు, పాణిగ్రహణం, అరుంధతి నక్షత్ర వీక్షణం వంటి క్రతువులు సంప్రదాయబద్ధంగా చేయించారు. బంగారు మంగళ సూత్రం, వెండి మట్టెలు, పెండ్లి వస్త్రాలు, తలంబ్రాలతో సహా పెళ్లి సామగ్రి ఉచితంగా ఆలయం తరఫున అందజేశారు. అనంతరం విందుభోజనం ఏర్పాటు చేశారు.

కిక్ బాక్సింగ్‌లో కాంస్య పతకం



సాగర్, వెంకటరమణను అభినందిస్తున్న బ్రహ్మయ్య

రాజమహేంద్రవరం రూరల్: జార్ఖండ్‌లోని తానా భగత్ ఇండోర్ స్టేడియంలో గత నెల జరిగిన కిక్ బాక్సింగ్ చిల్డ్రన్స్ అండ్ జూనియర్ జాతీయస్థాయి చాంపియన్‌షిప్‌లో బొమ్మూరు మారుతి సెల్ఫ్ డిఫెన్స్ విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో ఎన్.రుత్విక్ వీరసాగర్ +36 కేజీల లైట్ కాంటాక్ట్ విభాగంలో కాంస్య పతకం సాధించాడు. ఈ జాతీయస్థాయి పోటీలకు టటామి రిఫరీగా వ్యవహరించిన ఎన్.గిరివెంకట రమణకు ఏగ్రేడ్ రిఫరీగా ప్రశంసాపత్రాన్ని అందించారు. కాగా.. రుత్విక్ వీరసాగర్, కోచ్ ఎన్.గిరివెంకట రమణను ఆదివారం గోకుల్ రియల్ ఎస్టేట్ అధినేత ముంగమూరి బ్రహ్మయ్య అభినందించారు.

మోదీ పాలనలో సామాన్యుల తిప్పలు



సమావేశంలో పాల్గొన్న మురళీధర్ తదితరులు

సీటీఆర్ఐ: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెరిగిన గ్యాస్, డీజిల్, పెట్రోల్ నిత్యావసరాల ధరలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాలేపల్లి మురళీధర్ అన్నారు. స్థానిక కృష్ణానగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పుడు ప్రధాని మోదీ గ్యాస్ సిలిండర్‌పై రూ.200 ధర తగ్గింపు పేరుతో మళ్లీ కొత్త డ్రామాకు తెరతీశారన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

కిరాణాషాపులో నగదు చోరీ

రాజమహేంద్రవరం రూరల్: తన కిరాణాషాపులో గుర్తుతెలియని వ్యక్తి రూ.12 వేలు చోరీ చేశాడని శాటిలైట్ సిటీ సిబ్లాక్‌కు సీహెచ్ శివ గణేష్ కుమార్ ఆదివారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గణేష్ కుమార్ శాటిలైట్ సిటీ ట్రాన్స్‌ఫార్మర్ సెంటర్‌లో శ్రీదేవి రైస్ అండ్ జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నాడు. శనివారం షాపు పైన ఒక గది నిర్మాణం చేసి గృహప్రవేశం చేశాడు. అనంతరం షాపునకు తాళం వేసి దుర్గాసెంటర్‌లో ఇంటికి వెళ్లి నిద్రించాడు. ఆదివారం ఉదయం షాపుకు వచ్చేసరికి షట్టర్ తెరవగా వెనుక తలుపు పగలగొట్టి క్యాష్ కౌంటర్‌లోని రూ.12 వేలు నగదును చోరీ చేశారు. అతడి ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై ఎండీ జుబేర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శరవేగంగా కాలువ పనులు

మధురపూడి: పుష్కర ఎత్తిపోతల పథకం కాలువలో నీరు సక్రమంగా ప్రవహించేందుకు తుప్పలు, చెత్త తొలగింపు పనులు చురుకుగా జరుగుతున్నాయి. కోరుకొండ మండలంలోని దోసకాయలపల్లి, బూరుగుపూడి, గుమ్ములూరు, మధురపూడి గ్రామాల్లో శరవేగంగా నిర్వహిస్తున్నారు. పుష్కర కాలువ పరిధిలో కోరుకొండ మండలంలో 6,045 హెక్టార్ల విస్తీర్ణంలో వరి భూములున్నాయి. నాట్లు పనులు పూర్తయ్యి, కలుపు తొలగింపు పనులు జరుగుతున్నాయి.

నవోదయకు ఎంపిక

మధురపూడి: కోరుకొండ మండలం పశ్చిమగానుగూడెం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న డొక్కా అరవింద్ మోహన్ ఎటపాక జవహర్ నవోదయ విద్యాసంస్థలో సీటు సంపాదించాడు. ఇక్కడ ఐదో తరగతి చదువుతున్న మోహన్ ఎటపాకలో ఆరోతరగతిలో చేరనున్నాడు.

దేశాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



అవార్డు గ్రహీతలతో ప్రముఖులు

సీటీఆర్ఐ: దేశాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. ఫిలాంత్రోపిక్ సొసైటీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజా యోనా ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక వీఎల్ పురంలోని ఎల్ఐసీ ఉద్యోగ సంఘ భవన్‌లో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ బాల్యం నుంచే మంచి లక్షణాలు విద్యార్థులకు నేర్పిస్తే, మంచి సమాజం తయారవుతుందన్నారు. ఆ దిశగా ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ వహించాలని కోరారు. ఆర్‌జేడీ జి.నాగమణి మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిత్యవిద్యార్థిగా ఉంటూ విలువలతో కూడిన విద్యను అందించినప్పుడు దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. రుడా మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ గురువు సమాజానికి దిక్సూచి అన్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాస్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో ఓంశ్రీ సెక్యూరిటీ సర్వీసెస్ అధినేత డాక్టర్ ఎస్‌కేఎం వలీ, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ నరవ గోపాలకృష్ణ, అర్బన్ డీఐ.దిలీప్ కుమార్, కవి డాక్టర్ గూటం స్వామి మాట్లాడారు. హిందీ భాషోపాధ్యాయురాలు మెహరున్నిసా బేగం, లెక్కల టీచర్ కట్టుంగ సీతారామాంజనేయులుకు సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత సాఫల్య పురస్కారాలను అందించారు. మరో 15 మంది ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను మెరిటోరియస్ టీచర్ అవార్డులతో ఘనంగా సత్కరించారు.

కాపవరం అభివృద్ధికి రూ.3 కోట్ల కేటాయింపు



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఉత్సాహంగా గడప గడపకూ..

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం అభివృద్ధికి రూ.3 కోట్లు కేటాయించామని, అలాగే అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం కాపవరంలో రెండో రోజు ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత స్థానిక రామాలయంలో స్వామిని దర్శించుకున్నారు. అనంతరం గడప గడపకూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ కాపవరంలో మౌలిక వసతులతో పాటు మరిన్ని సదుపాయాలు కల్పించామన్నారు. సొంతిళ్లు లేని పేదలకు త్వరలోనే ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేస్తామన్నారు. కోరుకొండ, కాపవ రం గ్రామస్తుల కోసం ఎంపిక చేసిన ఇళ్ల స్థలాల విషయం కోర్టు వివాదంలో ఉండటంతో కొత్త ప్రాంతాన్ని తీసుకోనున్నట్టు తెలిపారు. పేదలకు సొంతిళ్లు దక్కకుండా ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు కోర్టుల్లో కేసులు వేయడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు పాలనలో కాపవరం అభివృద్ధికి కేవలం రూ.80 లక్షలు కేటాయిస్తే, జగనన్న ప్రభుత్వం రూ.3 కోట్లు కేటాయించిందన్నారు.

పచ్చదనం పెంపొందించడమే లక్ష్యం



సీడ్‌బాల్స్ పంపిణీ చేస్తున్న రామకృష్ణ, తీగెల రాజా

రాజమహేంద్రవరం రూరల్: పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా సీడ్‌బాల్స్ పంపిణీ చేస్తున్నట్టు రోటరీ ఐకాన్స్ క్లబ్ ప్రెసిడెంట్ తీగెల రాజా అన్నారు. తూర్పు రైల్వేస్టేషన్ రోడ్డులోని ఇమ్మణి గ్రౌండ్స్‌లో ఆదివారం ప్రముఖ వ్యాపారవేత్త ఇమ్మణి రామకృష్ణ చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభించారు. తీగెల రాజా, ప్రోగ్రాం చైర్మన్ ఆర్.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఒక నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. గతంలో మొక్కలను తీసుకువచ్చి నాటేవాళ్లమని, ప్రస్తుతం అడ్వాన్స్ పద్ధతిలో సీడ్‌బాల్స్ అందజేయడం జరుగుతోందన్నారు. 3020 రోటరీ డిస్ట్రిక్ట్‌లో ఉన్న అన్ని రోటరీ క్లబ్‌లు, స్కూళ్లు, స్వచ్ఛంద సేవా సంస్థలు, వాణిజ్య సంస్థలకు వీటిని అందించనున్నట్టు తెలిపారు. సుమారు 150 రకాల విత్తనాలతో వీటిని తయారు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇమ్మణి వెంకట్, కంటే వీరన్న చౌదరి, రోటేరియన్ ఈశ్వర్, రొటేరియన్ దావూద్, రాంబాబు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న హ్యాపీస్ట్రీట్



హ్యాపీస్ట్రీట్‌లో పిల్లల సందడి

రాజమహేంద్రవరం సిటీ: నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హ్యాపీ స్ట్రీట్ కార్యక్రమం నగర వాసులను ఎంతో ఆకట్టుకుంటోంది. జేఎన్ రోడ్డులోని ఏకేసీ కాలేజీ వద్ద గల పరమహంస యోగానంద మార్గ్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పలు వినోద కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చిన్నారులు, యువత, పెద్దలు ఉల్లాసంగా గడుపుతున్నారు. దీంతో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ సందడి నెలకొంటోంది.



చదరంగం ఆడుతున్న చిన్నారులు

సూర్యకుమార్ పట్టుదల స్ఫూర్తిదాయకం



మాట్లాడుతున్న గిరజాల బాబు

కడియం: గ్రూప్–1లో విజయం సాధించి, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్‌గా నియమితులైన చుక్కల సూర్యకుమార్ పట్టుదల నేటి యువతకు స్ఫూర్తిదాయకమని బాధ్యత సేవాసంస్థ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) అన్నారు. గ్రూప్–1 విజేత చుక్కల సూర్యకుమార్‌కు ఆదివారం కడియంలో బాధ్యత సేవా సంస్థ అధ్యక్షుడు గిరజాల బాబు ఆధ్వర్యంలో పౌర సన్మానం చేశారు. సూర్యకుమార్ మాట్లాడుతూ యువత సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి ఏకాగ్రతతో చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. అనంతరం చుక్కల సూర్యకుమార్‌ను, ఆయన తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావిపాటి రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ కార్యదర్శి బడుగు చిన్ని, జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల విష్ణు చక్రవర్తి, ఐఎస్‌ఏ మాజీ అధ్యక్షుడు పల్ల సుబ్రహ్మణ్యం, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి చిన వీరభద్రయ్య, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఈలి గోపాలం, నాగిరెడ్డి రామకృష్ణ, చెక్కపల్లి మురళి, గట్టి సూర్యచంద్రరావు, పంతంగణపతి, సాపిరెడ్డి కామేష్, సర్కార్ బాషా పాల్గొన్నారు.

నియోజకవర్గంలో ఆలయాలకు మహర్దశ

- జక్కంపూడి విజయలక్ష్మి
- చక్రద్వారబంధంలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ



చక్రద్వారబంధంలో భూమిపూజ సందర్భంగా హోమంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి



బొబ్బిల్లంక జగనన్న కాలనీలో గృహప్రవేశంలో పాల్గొన్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: నియోజకవర్గంలో ప్రగతి, ప్రజల సంక్షేమంతో పాటు దేవాలయాల అభివృద్ధికి కూడా ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. చక్రద్వారబంధంలో సుమారు రూ.కోటితో నిర్మించనున్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన యజ్ఞ,యాగాలలో పాల్గొన్నారు. వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి టీటీడీ నుంచి రూ.10 లక్షల మంజూరుకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో 117 ఆలయాల పునర్నిర్మాణానికి, అభివృద్ధికి టీటీడీ నుంచి నిధులను మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, నాయకులు వాడ్రేవు శ్రీను, తాతబ్బాయి, త్రిమూర్తులు, మార్గాని శ్రీను పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

సీతానగరం: నిరుపేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. బొబ్బిల్లంక జగనన్న లేఅవుట్ కాలనీలో ఆదివారం జరిగిన షేక్ షీలార్ ఇంటి గృహప్రవేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె.. షీలార్ దంపతులతో రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం చేయించారు. ఆమె ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో 31 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల స్థలాలు కేటాయించడమే కాక, ఇళ్ల నిర్మాణానికి అన్ని చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. జగనన్న కాలనీలో స్థలాలు పొందిన లబ్ధిదారులు, త్వరగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. అనంతరం బొబ్బిల్లంకలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులన పరిశీలించారు. సర్పంచ్ మెల్లిమి రామచంద్రరావు, పార్టీ నాయకులు మల్లిన చౌదరి, అరిగెల రవి, ఎం.శ్రీనివాసు పాల్గొన్నారు.

వేగవంతంగా రోడ్డు నిర్మాణ పనులు

రాజమహేంద్రవరం – సీతానగరం నాలుగు లైన్ల విస్తరణ రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. బొబ్బిల్లంక శివారున సిమెంట్ రోడ్డు పనులను ఆదివారం ఆమె పరిశీలించారు. నాణ్యత విషయంలో రాజీపడవద్దని కాంట్రాక్టర్‌కు సూచించారు. పనులు వేగవంతంగా చేయాలన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎటువంటి చర్యలు తీసుకోలేదని, పుష్కరాల సమయంలో వేసిన రోడ్డు నెల రోజులకే శిథిలమైందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తక్షణమే ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకువెళ్లి, నాలుగు లైన్ల రోడ్డును మంజూరు చేయించారని గుర్తు చేశారు. నవంబర్ నాటికి పనులు పూర్తవుతాయన్నారు.

నేడు దుప్పలపూడి ఉపసర్పంచ్ ఎన్నిక

అనపర్తి: మండలంలోని దుప్పలపూడి గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక సోమవారం నిర్వహించనున్నారు. ఎన్నిక ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామంలో భారీ బందోబస్తు ఏర్పాటుచేయడంతో పాటు పరిస్థితుల దృష్ట్యా గ్రామంలో 144 సెక్షన్ విధించారు. 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో దుప్పలపూడి పంచాయితీ పరిధిలోని 10 వార్డు స్థానాలకు గాను 8 స్థానాల్లో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు, ఒక స్థానంలో ఇండిపెండెంట్, మరో స్థానంలో టీడీపీ సానుభూతిపరుడు గెలుపొందారు. 1, 9వ వార్డు సభ్యులుగా గెలుపొందిన అభ్యర్థులు వివిధ కారణాలతో తమ పదవులకు రాజీనామా చేయడంతో గత నెల 19వ తేదీన వార్డు స్థానాలకు ఉపఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో గ్రామానికి చెందిన వల్లభశెట్టి రామసతీష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు ఇద్దరూ భారీ మెజార్టీతో విజయం సాధించారు.

మంగారాణికి సెంటా అవార్డు



కంబాలచెరువు: స్థానిక నాగరాజా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా పనిచేస్తున్న మోటూరి మంగారాణి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేకంగా ఇస్తున్న సెంటా అవార్డుకు జిల్లా నుంచి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ వివరాలను ఆమె ఆదివారం తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో పాటు ప్రత్యేకంగా సెంటర్ ఫర్ టీచర్ అక్రిడిటేషన్ (సెంటా) అవార్డును ఏర్పాటు చేసింది. దీనికి ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు. ఆ ప్రకారం విడుదల చేసిన ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 10 మంది, జిల్లాస్థాయిలో 120 మంది ఎంపికయ్యారు. దీనిలో భాగంగా జిల్లా అవార్డుకు నలుగురు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎంపిక కాగా వారిలో ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి మంగా రాణి ఒక్కరే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ఆమెతో పాటు వీకే పద్మ, నిర్మలసాయి, సునన్నరాణి, నీలమ్ ఈ అవార్డుకు ఎంపికైన వారిలో ఉన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, అర్బన్ రేంజ్ డీఐ బి. దిలీప్ కుమార్, అర్బన్ ఎంఈవో 2 రమా రజని అభినందించారు.

15న అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావం

ప్రకాశం నగర్: విజయవాడలోని జింఖానా గ్రౌండ్‌లో ఈనెల 15వ తేదీన అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావం నిర్వహిస్తున్నట్టు యూనియన్ రాష్ట్ర నాయకులు తిరుపతిరావు, నాయుడు తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం అగ్రిగోల్డ్ సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. తిరుపతిరావు మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు అగ్రిగోల్డ్ సమస్యను ప్రజా సమస్యగా భావించి మద్దతు తెలపాలని కోరారు.

నేడు సీపీఎం ధర్నా

ప్రకాశం నగర్: సీపీఎం చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా సోమవారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నగర కార్యదర్శి బి.పవన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక వై.జంక్షన్‌లోని రైతుబజార్ వద్ద ప్రజలకు పోస్టర్లను పంపిణీ చేశారు. పార్టీ జిల్లా కమిటి సభ్యులు రాజులోవ, పోలిన వెంకటేశ్వరరావు, ఐ.సుబ్బారావు పాల్గొన్నారు.

తోరాటికి పలువురి పరామర్శ

ధవళేశ్వరం: పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ తోరాటి ప్రభాకరరావును ఆదివారం పలువురు పరామర్శించారు. ఇటీవల ప్రభాకరరావు సతీమణి తోరాటి విజయలక్ష్మి మృతి చెందారు. వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ పరామర్శించి ఓదార్చారు. వివిధ పార్టీల నాయకులు ,గ్రామ పెద్దలు పరామర్శించిన వారిలో ఉన్నారు.

మెగా జాబ్‌మేళా

కంబాలచెరువు: రాజీవ్ గాంధీ కళాశాలలో ఆదివారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. రెండు రోజులు పాటు జరిగే ఈ కార్యక్రమానికి నిరుద్యోగులు వినియోగించుకోవాలని విద్యాసంస్థల చైర్మన్ జీవీ హర్ష కుమార్ తెలిపారు. విప్రో, గస్ ఫ్యాక్ట్, టెలి ఫెర్ఫార్మెన్స్, హైలెట్ టెక్నాలజీ, టేక్‌వే సాఫ్ట్‌వేర్, ముత్తూట్ గ్రూప్, త్రీజీ హైయర్ సర్వీస్, బిట్స్ సాఫ్ట్ సొల్యూషన్స్ తదితర 55 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. సుమారు 700 మంది అభ్య ర్థులు ఎంపికయ్యారన్నారు. కళాశాల డైరెక్టర్లు జీవీ శ్రీరాజ్, జీవీ సుందర్, ప్రిన్సిపల్ మేరీజోన్స్ పాల్గొన్నారు.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

రంగంపేట: మండలంలోని వడిశలేరులోని అరుంధతీపేటలో నిర్వహించిన దాడుల్లో 10 లీటర్ల సారా కలిగి ఉన్న గ్రామానికి చెందిన తాతపూడి ఏసుబాబును అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ జి.వెంకటలక్ష్మి తెలిపారు. విచారణలో తాతపూడి కన్నారావు అనే వ్యక్తి సారా సరఫరా చేసినట్టు తెలపడంతో కన్నారావుపై కూడా కేసు నమోదు చేశామన్నారు.

సినిమాలు



శ్యామల:ఖుషి
సూర్యమినీ:బెదురులంక 2012
సూర్యప్యాలెస్:దిఈక్వలైజర్–3
స్వామి:ఖుషి
శివజ్యోతి:ఖుషి
అనుశ్రీ:ఖుషి
రాజా:ఖుషి
అశోక:జైలర్
ఊర్వశి:గాండీవధారి అర్జున
రంభ:భోళాశంకర్
మేనక:బాయ్స్‌హాస్టల్, భూతాలబంగ్లా
గీతాఅప్సర:బెదురులంక 2012
నామవరం
వీఎస్ మహల్ : ఖుషి
ధవళేశ్వరం
మురళీకృష్ణ : ఖుషి
కడియం
వెంకటసూర్య : ఖుషి